క్లుప్తంగా

నిత్యాన్నదానానికి నాలుగేళ్లు



దుప్పట్లు, భోజనం పంపిణీ చేస్తున్న పోసికుమార్ దంపతులు

ధవళేశ్వరం: స్ఫూర్తి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదానానికి శనివారంతో నాలుగేళ్లు పూర్తయింది. ఈ సందర్భంగా ధవళేశ్వరంలోని ట్రస్ట్ కార్యాలయంలో వృద్ధులు, దివ్యాంగులకు దుప్పట్లు, భోజనం పంపిణీ చేశారు. ట్రస్ట్ చైర్మన్ ముత్యాల పోసికుమార్, సత్య దంపతులు మాట్లాడుతూ 2021లో ప్రారంభించిన నిత్యాన్నదాన కార్యక్రమం దాతల సహకారంతో విజయవంతంగా జరుగుతోందన్నారు. అనంతరం అర్చిస్ బాబు జన్మదినాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు కేవీఆర్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

సమాజానికి వేమన పద్యాలు చాలా అవసరం



వేమన విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న తోరాటి వసంతరావు తదితరులు

కడియం: వేమన శతక పద్యాలు నేటి సమాజానికి చాలా అవసరమని ప్రముఖ విద్యావేత్త తోరాటి వసంతరావు అన్నారు. చెళ్లపిళ్ల వేంకట శాస్త్రి కళాసేవా సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అడపా సుబ్రహ్మణ్యం, చిలుకూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శనివారం వేమన జయంత్యుత్సవం నిర్వహించారు. వేమగిరి బుద్ధ విహార్ అధ్యక్షుడు యార్లగడ్డ మైత్రేయి నెలకొల్పిన భారీ వేమన విగ్రహానికి పూలమాలలు వేసి, పూలు సమర్పించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సమితి గౌరవ అధ్యక్షుడు తోరాటి మాట్లాడుతూ నేటి సమాజంలో నూతన తరానికి వేమన పద్యాలు ఎంతో అవసరమన్నారు. అనంతరం వేమన శతక పద్యాల పుస్తకాలను పలువురికి బహూకరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు ఆకుల వీర్రాజు, చెళ్లపిళ్ల కమిటీ సభ్యులు తమ్మిశెట్టి ప్రసాద్, డి.నీలకంఠరావు, ఆకుల సూర్యనారాయణ, బి.రామకృష్ణ, జి.తాతబ్బాయి, కె.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఇంటి పట్టా అందజేత



బాధితులకు ఇంటి పట్టా, చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరి, ఆర్డీవో కృష్ణ నాయక్

కడియం: నర్సరీ కూలి రౌతు కస్తూరి కుటుంబానికి కడియపులంక పంచాయతీ దోసలమ్మ కాలనీలో ప్రభుత్వం మంజూరు చేసిన ఇంటి స్థల పట్టాను రాజమహేంద్రవరం ఆర్డీవో కృష్ణ నాయక్‌తో కలిసి ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి శనివారం అందించారు. అలాగే రూ.5 లక్షలు చెక్కు, రూ.25 వేల నగదును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కస్తూరి కుమార్తెకు ఫిబ్రవరి నుంచి రూ.6 వేల దివ్యాంగ పింఛన్, మరో లక్ష రూపాయలు అందజేస్తామన్నారు. కుమారుడి చదువు పూర్తి కాగానే ఉపాధి అవకాశం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.పోసిబాబు, ఎంపీపీ వెలుగుబంటి వెంకట సత్య ప్రసాద్, వైస్ ఎంపీపీ పంతం గణపతి, మండల తెదేపా అధ్యక్షుడు వెలుగుబంటి రాఘురామ్, సర్పంచ్ పాతంశెట్టి రాంజీ, మార్గాని సత్యనారాయణ, అన్నందేవుల చంటి తదితరులు పాల్గొన్నారు. కాగా.. కడియపులంకకు చెందిన నర్సరీ కూలి కస్తూరి ఇటీవల అత్యాచారానికి గురై మృతి చెందిన విషయం తెలిసిందే.

సినిమాకెళితే షాకే..

- విపరీతంగా పెరిగిన టిక్కెట్ ధరలు
- తినుబండారాలదీ అదే పరిస్థితి
- థియేటర్‌కు వెళ్లాలంటే దడే



రాజమహేంద్రవరంలోని ఓ సినిమా థియేటర్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): సినిమా అనేది ఎంతో మందికి వినోదాన్ని పంచే ప్రధానం సాధనం. ఇంటిల్లిపాదీ థియేటర్‌కు వెళ్లి తమ అభిమాన నటుడి చిత్రాన్ని చూసి, ఇంటర్వెల్లో తమకు నచ్చిన తినుబండారాలు ఆరగించి ఎంతో మధురానుభూతిని పొందేవారు. అయితే ఇదంతా గతం. ప్రస్తుతం ఆకాశాన్నంటుతున్న టికెట్ రేట్లు, సామాన్యుడికి అందుబాటులో లేని స్నాక్స్ ధరలతో థియేటర్ వైపు వెళ్లాలంటేనే జంకుతున్నారు. తమ పిల్లలు మారం చేస్తుండటంతో కొందరు తప్పనిసరి పరిస్థితిలో సినిమాకు వెళుతున్నారు. గతంలో సినిమా టిక్కెట్లు, స్నాక్ ధరలు సామాన్యులకు అందుబాటులో ఉండేవి. కుటుంబ సభ్యులతో కలిసి సినిమా చూసి రావడానికి టిక్కెట్లు, తినుబండారాలతో కలిసి రూ.600 నుంచి రూ.800 వరకు మాత్రమే అయ్యేవి. ఈ ఖర్చు ప్రజలకు పెద్ద భారంగా మారేది కాదు. అయితే ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది.

అప్పులు చేస్తూ..

సినిమాకు తీసుకువెళ్లాలని పిల్లలు కోరితే కాదనలేక, తమ స్తోమతకు మించి ఖర్చు చేయలేక ఇంటి పెద్దలు నలిగిపోతున్నారు. కొందరు అప్పులు చేసి మరీ తమ పిల్లల సంతోషాలను తీరుస్తున్నారు. మరికొందరు ముందూ వెనుకా చూడకుండా క్రెడిట్ కార్డుల్లో డబ్బులు ఖర్చు చేసి, నెలాఖరులో బిల్లు చెల్లింపు కోసం తిరిగి అప్పులు చేస్తున్నారు. దాదాపు 20 శాతం కుటుంబాల పరిస్థితి ఇలాగే ఉంటోంది.

అధిక ధరలతో జేబులకు చిల్లు

సంక్రాంతి సమయంలో అనేక సినిమాలు విడుదలవుతాయి. పండగ కోసం దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు తమ కుటుంబ సభ్యులతో కలిసి సినిమా చూడాలని కోరుకుంటారు. దీంతో థియేటర్లన్నీ ప్రేక్షకులతో కిటకిటలాడతాయి. ఈ నేపథ్యంలో భారీగా లాభాలు సాధించాలనే ఉద్దేశంతో ప్రభుత్వాలను ఒప్పించి టిక్కెట్ ధరలను నిర్మాతలు పెంచుకుంటున్నారు. థియేటర్ నిర్వాహకులు తినుబండారాలపై అధిక ధరలు వసూలు చేస్తూ ప్రేక్షకుల జేబులకు చిల్లు పెడుతున్నారు.

తారెత్తిస్తున్న రేట్లు

రాజమహేంద్రవరం నగరం, రూరల్ ప్రాంతాల్లో సుమారు 16 థియేటర్లు ఉన్నాయి. సంక్రాంతి సందర్భంగా విడుదలైన సినిమాలకు ఒక్కో క్లాస్ టిక్కెట్ రూ.145 ధరకు అదనంగా రూ.100 కలిపి రూ.245కి విక్రయిస్తున్నారు. ఒక్కో నేల టిక్కెట్ రూ.75 ధరకు అదనంగా రూ.75 కలిపి రూ.150కి అమ్ముతున్నారు. కొన్ని థియేటర్ల నిర్వాహకులు ఆన్‌లైన్‌లో కొన్ని టికెట్లు మాత్రమే పెట్టి, కొన్ని ఆబ్లిగేషన్లకు ఇచ్చి, మిగిలినవి బ్లాక్ విక్రయదారులకు ఇచ్చేస్తున్నారు. దీని వల్ల క్లాస్ టిక్కెట్ రూ.500, నేల రూ.300కు విక్రయిస్తున్నారు. ఇక తినుబండారాలు ధరల విషయానికి వస్తే వాటర్ బాటిల్ రూ.30, పాప్‌కార్న్ రూ.60, పెద్దది రూ.150, స్వీట్‌కార్న్ రూ.50, పఫ్ రూ.30, సమోసా రూ.10, కూల్‌డ్రింక్ రూ.50 (టిన్, గ్లాస్), సీసా రూ.30కు విక్రయిస్తున్నారు. ఈ లెక్కన ఓ కుటుంబంలో నలుగురు సినిమాకు వెళ్లాలంటే రూ.1500 నుంచి రూ.1800 వరకూ ఖర్చవుతోంది.

వసతులు శూన్యం

సామాన్యుడు సినిమాకు వెళితే వాటర్ బాటిల్ కొనుక్కొనే పరిస్థితి ఉండదు. ప్రతి సినిమా థియేటర్‌లో తప్పనిసరిగా తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలి. అయితే ఏ థియేటర్‌లోనూ అది కనిపించదు. మరుగుదొడ్ల శుభ్రత గురించి చెప్పనవసరం లేదు. థియేటర్లను పర్యవేక్షించాల్సిన అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం వల్లనే ఈ పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని ప్రేక్షకులు కోరుతున్నారు.

సామాన్యుడికి సినిమా దూరం



కొత్త సినిమాల విడుదల సమయంలో టిక్కెట్ల ధరలను విపరీతంగా పెంచడంతో సినిమాకు సామాన్యుడు దూరమవుతున్నాడు. ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకుని టిక్కెట్ల ధరలను విపరీతంగా పెంచేస్తున్నారు. దీనివల్ల సామాన్య, మధ్యతరగతి ప్రజలు సినిమా చూడాలంటేనే భయపడుతున్నారు. పోనీ పెంచిన ధరలకు అనుగుణంగా సినిమా థియేటర్‌లో సౌకర్యాలు బాగున్నాయనుకోవడం పొరపాటే. ఇక తినుబండారాలు, శీతల పానీయాలను ధరలను పెంచేస్తున్నారు. ప్రేక్షకులకు ఉచితంగా తాగునీరు, పరిశుభ్రమైన మరుగుదొడ్ల వసతి కల్పించాల్సిన బాధ్యత ఆయా థియేటర్ల యాజమాన్యాలపై ఉంది.

– **ధర్నాలకోట వెంకటేశ్వరరావు,** అడ్వకేట్, జనరల్ సెక్రటరీ, కన్స్యూమర్స్ రైట్స్ అవేర్నెస్ సెల్, రాజమహేంద్రవరం

ఖైదీలపై వివక్ష చూపొద్దు



సెంట్రల్ జైలులో మాట్లాడుతున్న జిల్లా జడ్జి గంధం సునీత, చిత్రంలో ప్రకాష్‌బాబు

కంబాలచెరువు: కారాగారంలోని ఖైదీలను కుల, మత, లింగ వివక్షత లేకుండా చూడాలని జిల్లా ప్రధాన జడ్జి గంధం సునీత అన్నారు. బోర్డు ఆఫ్ విజిటర్స్‌తో కలిసి రాజమహేంద్రవరం కేంద్ర కారాగారాన్ని శనివారం జడ్జి గంధం సునీత, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాష్‌బాబు సందర్శించారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు మోడల్ ప్రిజన్స్ మాన్యువల్, 2016లోని 29వ అధ్యాయం ప్రకారం జైలు అధికారులకు జారీ చేసిన అన్ని నియమాలు, నిబంధనలు, ఆదేశాల ప్రకారం కుల, మత, లింగ వివక్షత లేకుండా ఖైదీలను చూడటం, వాటి అమలుకు సంబంధించిన పరిశీలన చేశారు. ఖైదీల జీవన పరిస్థితులు, సాధారణ పరిశుభ్రత, పారిశుధ్యం, బ్యారక్స్‌లో వాష్ రూమ్‌లు, మురుగునీటి నిర్వహణ, భద్రత, ఆహార ప్రమాణాలు, వసతులను, సదుపాయాలను పరిశీలించారు. అనంతరం ఖైదీలతో మాట్లాడుతూ న్యాయవాది లేని వారికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచితంగా న్యాయవాదిని నియమిస్తామన్నారు. ఖైదీలకు ఎలాంటి న్యాయ సమస్యలున్నా పారా లీగల్ వలంటీర్ల ద్వారా, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ద్వారా సంస్థకు తెలియజేయాలన్నారు.

నర్సరీని సందర్శించిన ఆర్డీవో



ఆర్డీవో కృష్ణనాయక్‌కు మొక్క అందజేస్తున్న పెద్ద సత్యనారాయణ

కడియం: కడియపులంకలోని సత్యదేవ నర్సరీని రాజమహేంద్రవరం రెవెన్యూ డివిజన్ అధికారి కృష్ణ నాయక్ శనివారం సందర్శించారు. ఆయనకు నర్సరీ చైర్మన్ పుల్లా పెద్ద సత్యనారాయణ స్వాగతం పలికారు. అక్కడి మొక్కలను, పెంచే విధానాన్ని చూసి రైతులను ఆర్డీవో అభినందించారు. నర్సరీని స్థాపించిన కడియం నర్సరీ మ్యాన్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు పుల్లా చంటియ్యకు నివాళులర్పించారు. దేశ విదేశీ మొక్కలతో సత్యదేవ నర్సరీ కనువిందు చేస్తోందన్నారు. ఆయన వెంట కడియం తహసీల్దార్ పోసిబాబు ఉన్నారు.

ప్రతినెలా మూడో శనివారం స్వచ్ఛ దివస్



ధవళేశ్వరంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి



ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వరరావు

ధవళేశ్వరం: స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్ కార్యక్రమం మనందరిదని కలెక్టర్ పి.ప్రశాంతి, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. రాజీవ్ కాలనీలో శనివారం సాయంత్రం జరిగిన ఆ కార్యక్రమానికి వారిద్దరూ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత, మనం నివసించే, తిరిగే ప్రాంతాలలో శానిటేషన్ కార్యక్రమాల నిర్వహణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూపకల్పన చేస్తున్నాయన్నారు. దీనికి 12 నెలల కార్యచరణ ప్రణాళిక రూపొందించడం జరిగిందన్నారు. అందులో భాగంగానే జిల్లా స్థాయి స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్‌కు శ్రీకారం చుట్టారన్నారు. ప్రభుత్వ సూచనల మేరకు ప్రతి నెలా మూడో శనివారం ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. మిశ్రమ వ్యర్థాలు కలిగిన చెత్త నుంచి ఆ ప్రదేశంలో తడి, పొడి చెత్తను ఆదాయ వనరుగా అభివృద్ధి చేసుకునే దిశగా అడుగులు వేయాలన్నారు. ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ ప్రతి ఒక్కరినీ పరిసరాల పరిశుభ్రతలో భాగస్వాములు చేయడంతో పాటు బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేసే అలవాటును అరికట్టడం, సామూహిక క్లీనింగ్ డ్రైవ్‌ల ద్వారా చెత్త, చెదారం వంటివి తొలగింపు కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి జిల్లా గ్రామ పంచాయతీ అధికారి ఎం.నాగలత, ఎంపీడీవో డి.శ్రీనివాసరావు, ధవళేశ్వరం సీఐ టి.గణేష్, ఈవోపీఆర్డి ఆర్మ్‌స్ట్రాంగ్, ధవళేశ్వరం పంచాయతీ కార్యదర్శి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతపై అవగాహన అవసరం

రాజమహేంద్రవరం రూరల్: ప్రతి ఉద్యోగి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు, స్వచ్ఛతపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో శనివారం సిబ్బందితో స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి నెలా మూడో శనివారం ప్రతి కార్యాలయంలో స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని అమలు చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఈ సందర్భంగా కార్యాలయ ఆవరణలో మొక్కలను నాటి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి

కడియం: ప్రతి ఒక్కరూ పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని జేగురుపాడు సర్పంచ్ యాదల సతీష్ చంద్ర స్టాలిన్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా ఆయన ట్రాక్టర్ నడుపుకొంటూ దళితపేట ఇందిరానగర్ కాలనీలో ఇంటింటికి వెళ్లి, డస్టుబిన్నుల ద్వారా తడి, పొడి చెత్తను సేకరించారు. అనంతరం ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అందరూ తమ స్వగృహంతో పాటు పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని అన్నారు. వారితో స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అయినవిల్లి శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎక్సైజ్ నార్త్ స్టేషన్‌లో..

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాలను అనుసరించి రాజమహేంద్రవరం ఎక్సైజ్ నార్త్ స్టేషన్ ఆవరణలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్ కార్యక్రమం చేపట్టినట్లు జిల్లా ఎక్సైజ్ అధికారి సీహెచ్ లావణ్య తెలిపారు. మనం నివసించే ప్రాంతాలు, కార్యాలయ ఆవరణలో పరిసరాల పరిశుభ్రత పాటించాలని విజ్ఞప్తి చేశారు. ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ హౌస్ అధికారి ఆర్.త్రినాథ్, సబ్ ఇన్‌స్పెక్టర్ సి.రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.



ట్రాక్టర్ నడుపుతూ చెత్తను సేకరిస్తున్న సర్పంచ్ సతీష్‌చంద్ర స్టాలిన్

జేఎల్‌ఎం సమస్యలను పరిష్కరించాలి



సమావేశంలో నినాదాలు చేస్తున్న జేఎల్‌ఎంలు, రాష్ట్ర నాయకులు

రాజమహేంద్రవరం రూరల్: విద్యుత్ శాఖలో పనిచేస్తున్న గ్రేడ్–2 జూనియర్ లైన్ మెన్ల (జేఎల్‌ఎం) సమస్యలను వెంటనే పరిష్కరించాలని రాష్ట్రస్థాయి నాయకులు డిమాండ్ చేశారు. లాలాచెరువు హౌసింగ్ బోర్డు కాలనీలోని మహాత్మా గాంధీ సైకిల్ వర్తకుల సంఘం కల్యాణ మండపంలో శనివారం రాష్ట్ర స్థాయి జూనియర్ లైన్ మెన్ గ్రేడ్–2 ఎనర్జీ అసిస్టెంట్ కోఆర్డినేషన్ సమావేశం జరిగింది. రాష్ట్రంలోని జేఎల్‌ఎం లకు జరుగుతున్న అన్యాయం, విధి నిర్వహణలో జరుగుతున్న ప్రమాదాలపై రాష్ట్ర నాయకులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, జేఎల్‌ఎంలకు ఏపీఎస్‌ఈబీ నిబంధనల ప్రకారం పాత పద్ధతిలో సర్వీస్ రెగ్యులేషన్స్ అమలు చేయాలన్నారు. ప్రమోషన్ ఛానల్ కల్పిస్తూ విద్యుత్ ప్రమాదాలలో మరణించిన బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం భవిష్యత్తు కార్యాచరణపై చర్చించారు. ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రులకు తమ సమస్యలపై వినతి పత్రాలు అందింస్తామని, అప్పటికి స్పందించకపోతే భవిష్యత్తులో ఎనర్జీ అసిస్టెంట్ల సమస్యలపై రాష్ట్ర వ్యాప్త నిరసనలు తెలియజేస్తామన్నారు. సమావేశంలో పి.రాజు, సీహెచ్ కేశవ, జి.సూర్యనారాయణ, ఐ.తాతాజీ, ఎం.రాము పి.వీరబాబు పాల్గొన్నారు.

రాజానగరం పీజీఆర్‌ఎస్‌కు హాజరు కానున్న కలెక్టర్

సీటీఆర్ఐ: రాజానగరంలో సోమవారం జరిగే పీజీఆర్‌ఎస్ కార్యక్రమానికి కలెక్టర్ పి.ప్రశాంతి హాజరవుతున్నారు. అలాగే కలెక్టరేట్‌లో జరిగే కార్యక్రమంలో జిల్లాస్థాయి అధికారులందరూ యథాతథంగా పాల్గొంటారు. ప్రతి వారం మాదిరిగానే ప్రజలు తమ సమస్యలను అర్జీలను అందజేయవచ్చు. డివిజన్, మండల స్థాయిల్లో యథాప్రకారం జరుగుతుంది.

వైద్య శిబిరం

కంబాలచెరువు: జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలలో భాగంగా జిల్లా రవాణాశాఖ కార్యాలయం ప్రాంగణంలో జిల్లా రవాణాధికారి ఆర్.సురేష్ సూచనల మేరకు శనివారం వైద్యశిబిరం నిర్వహించారు. రాజమండ్రి లారీ ఓనర్స్ అసోసియేషన్, ది రాజమండ్రి మినీ గూడ్స్ వెహికల్ ఓనర్ అసోసియేషన్ సభ్యులు, వివిధ వాహన యజమానులు, డ్రైవర్లకు ఆరోగ్య, కంటి పరీక్షలు చేశారు. మందులు, అవసరమైన వారికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు.

సురేష్ కుటుంబానికి పలువురి పరామర్శ



సూర్యకాంతం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కన్నబాబు, జక్కంపూడి రాజా, శివరామ సుబ్రహ్మణ్యం



కార్యక్రమానికి హాజరైన అంబటి రాంబాబు, చెల్లుబోయిన వేణు తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: మాతృవియోగంతో బాధపడుతున్న యాళ్ల సురేష్, ఆయన కుటుంబ సభ్యులను శనివారం పలువురు నాయకులు పరామర్శించారు. రాజమహేంద్రవరం విద్యుత్ నగర్‌లో శనివారం జరిగిన సురేష్ మాతృమూర్తి సూర్యకాంతం దశదిన కర్మ కార్యక్రమానికి మాజీ మంత్రులు అంబటి రాంబాబు, కురసాల కన్నబాబు, చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ హాజరయ్యారు. ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సురేష్, కుటుంబ సభ్యులను పరామర్శించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, జక్కంపూడి గణేష్, మాజీ ఎమ్మెల్యేలు రౌతు సూర్యప్రకాశరావు, పెండెం దొరబాబు, పర్వతనేని పూర్ణచంద్రరావు, ఏపీఐఐసీ మాజీ చైర్మన్ శివరామ సుబ్రహ్మణ్యం, నందెపు శ్రీనివాస్, అడపా శ్రీహరి, మేడపాటి అనిల్ కుమార్ రెడ్డి తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

జ్యోతుల ప్రభాకరరావు మృతి తీరని లోటు



జ్యోతుల ప్రభాకరరావు చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న సారథి, శ్రీరామ్మూర్తి తదితరులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): సాక్షి సీనియర్ సబ్ ఎడిటర్ జ్యోతుల ప్రభాకరరావు మృతి ఆ కుటుంబానికి, పాత్రికేయులకు తీరని లోటని సీనియర్ పాత్రికేయులు అన్నారు. ది రాజమండ్రి ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో శనివారం జ్యోతుల ప్రభాకరరావు సంతాప సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కుడిపూడి సారథి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సారథి, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి మండెల శ్రీరామ్మూర్తి, సీనియర్ పాత్రికేయులు శ్రీనివాసరెడ్డి, పాలపర్తి శ్రీనివాస్ తదితరులు.. ప్రభాకరరావు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. పాత్రికేయుడిగా, సబ్ ఎడిటర్‌గా, నర్సరీ రైతుగా జ్యోతుల ప్రభాకరరావుతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. అనంతరం ప్రభాకరావు ఇంటి వద్ద ఆయన కుమారుడు నగేష్‌కు రూ.10 వేలను ప్రెస్‌క్లబ్ తరఫున అందజేశారు.

మాజీ మంత్రి వేణు పరామర్శ

జ్యోతుల ప్రభాకరరావు కుమారుడు నగేష్, కుటుంబ సభ్యులను శనివారం వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ పరామర్శించారు. జ్యోతుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఎన్టీ రామారావు సేవలు స్ఫూర్తిదాయకం



ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న బీసీ సంఘ సభ్యులు

రాజమహేంద్రవరం రూరల్/కడియం: టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు సేవలు స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా కోటిపల్లి బస్టాండ్ సెంటర్‌లోని ఆయన విగ్రహానికి శనివారం గోరంట్ల, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ, పార్టీ శ్రేణులు నివాళులర్పించారు. అనంతరం రిక్షా కార్మికులకు వస్త్రాలు, పండ్లు పంపిణీ చేశారు. హుకుంపేట గ్రామానికి చెందిన ప్రగళ్లపాటి కల్పనకు రూ. 7 లక్షలు, బొమ్మూరులో అకాల మరణం చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త మంత్రి జగదీష్ కుటుంబానికి రూ.2 లక్షలు, 16వ డివిజన్ బాలాజీ పేటకు చెందిన వాసుపల్లి జనార్ధనరావుకు రూ.2,61,197 ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. వికలాంగుల కార్పొరేషన్ ద్వారా కంచిపాటి గోవింద్ ఏర్పాటు చేసిన వీల్ చైర్, ట్రైసైకిళ్లను అర్హులకు అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి యర్ర వేణుగోపాల్ రాయుడు, టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ వాసిరెడ్డి రాంబాబు, రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి మజ్జి పద్మావతి, రూరల్, కడియం మండలాల పార్టీ అధ్యక్షులు మత్సేటి ప్రసాద్, వెలుగుబంటి రఘురాం తదితరులు పాల్గొన్నారు.

సీటీఆర్ఐ: టీడీపీ వ్యవస్థాపకుడు, దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు వర్ధంతి సందర్భంగా కోటిపల్లి బస్టాండ్ సెంటర్‌లోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బీసీ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు సానబోయిన రామారావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు గుత్తుల సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షులు ఉప్పిడి గంగాధరరావు, బత్తిన ఏడుకొండలు, ప్రధాన కార్యదర్శి గొర్సా తాతబ్బాయి పాల్గొన్నారు.

బలమైన కార్మికోద్యమం నిర్మించాలి



పిళ్లై, రామనాథం చిత్రపటాలకు పుష్పాంజలి ఘటిస్తున్న సీఐటీయూ నాయకులు

ధవళేశ్వరం: ఇరిగేషన్ కార్మికోద్యమ నిర్మాత పి.మనోహర్ పిళ్లై, ప్రజా దర్శకుడు టీజే రామనాథం స్ఫూర్తితో బలమైన కార్మికోద్యమం నిర్మించాలని సీఐటీయూ సీనియర్ నాయకుడు టీఎస్ ప్రకాష్ పిలుపు నిచ్చారు. ధవళేశ్వరం సీఐటీయూ కార్యాలయంలో శనివారం పిళ్లై, రామనాథం వర్ధంతి సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ఎస్ మూర్తి అధ్యక్షత వహించారు. తొలుత పిళ్లై, రామనాథం చిత్రపటాలకు టీఎస్ ప్రకాష్, గురవారెడ్డి పూల మాల వేసి నివాళులర్పించారు. సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షుడు టి.అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా త్యాగరాజ స్వామి జయంతి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక గౌతమి ఘాట్‌లోని త్యాగరాజస్వామి మందిరంలో శనివారం త్యాగరాజ స్వామి జయంతి ఘనంగా నిర్వహించారు. వాయిద్య కళాకారులు కోటిపల్లి బస్టాండ్ వద్ద ఆంజనేయ స్వామి ఆలయం నుంచి త్యాగరాజస్వామి వారి మందిరం వరకు ర్యాలీ నిర్వహించారు. వాయిద్యాల కళాకారులు కమ్యూనిటీ హాల్లో ఆరాధన కార్యక్రమం నిర్వహించారు.